# వారసుడు

మురయా

## కథాత్రయంలో మూడవది

"ఏమట్ల తూల్తున్నరు?"

"ఏంలేదు, కొంచెం ఔషధం సేవించాను."

"గట్లనా! మీరు తాగుతరని మా ఇంట్ల ఎవరికీ తెలవదే?"

"అహ తెలి స్తే?"

"ముందు తెలిసుంటె తాగుబోతుకు బిడ్డనిస్తారు?"

"బిడ్డ ఏమిటి? కూతురనా!? సరె. తాగుతానని ఇప్పుడు తెలి "సందిగా-ఏం చేస్తావు?"

"తాగుతరు. మరి...తింటారా?"

"అంటే?"

"గుడ్లు, మాంసం తింటరా అని?"

"ఛ ఛ ఎప్పుడూ ముట్టుకోలేదు. అయినా ఏమిటలా అడుగుతున్నావ్? నా ఔషధ సేవ నీకు అంత విచిత్రంగా ఉన్నదా?"

"మా ఊర్లల్ల బాపనోళ్ళ ఇండ్లల్ల తాగరు; తినరు. ఆచార్ల ఇండ్లల్ల చాటుగ మాటుగ తాగుతరు, తింటరు. కరణాలు-దొరలు కొందరు కొందరు తాగుతరుగాని, చెప్పుకోరు."

"మరి మీరు కూడ దొరలేగా?"

"అహ మీ కెరికేనే! కాని, మేము ప్రథమ శాఖ."

"అల్లాగా. అంతా బ్రాహ్మణులేగా-బాపనోళ్ళు అనడం బాగులేదు. చాలా మొరటుగా ఉన్నది."

"మంచిది మ రనను. గా డట్లనే అంటరు పౌరోహిత్యం చే సే వైదికులను."

"అల్లాగా. మరి మేమూ వైదికులమేగా!"

"ఎరికే...మానాయన చెప్పిన్రు. మీ నాయనగారూ, అమ్మగారూ మంచి ఆచారవంతలనీ, జాగ్రత్త గుండమనీ చెప్పిన్రు."

"చెప్పారు అను. అది సరే-మా ఇంటికి వచ్చి నెలరోజు లయింది. మా వదినా, మా మీనాక్షి కాత్యాయినీ వాళ్ళు మామాటలు-అదే మాట తీరు నేర్పడం లేదా? వాళ్ళను చూచి నువ్వు నేర్చుకోవడం లేదా? నేర్చుకొని తీరాలని నిర్బంధం ఏమీ లేదులే."

"మీ వదినగారు మీతో ఎట్ల దో "స్తగ, మంచిగ, మర్యాదగుండలో చెప్పినది. ఆపిల్లలు నాతో ఎక్కువ మాట్లాడరు. దొడ్డుగున్ననని నవ్విన్రు. ఎగతాళి చే "సిన్రు."

"నేను కోప్పడతాన్లే. ఏమనుకోకు. ఏదో చిన్న పిల్లలు."

"ఏంకాదు. నా కంటె పెద్ద. ఆ మాట అడిగిన...వాళ్ళు చెప్పిన్రు. వదిన వరసయితె గట్లనే పరాచికా లాడొచ్చు. కాని, చిన్నమ్మను



గిట్లంటరా?! నా కయితె మంచి గనిపించ లా."

"సరె. నేను చెబుతా నన్నాగా ఇంక ఊరుకో. అది సరేగాని, ఇంతకూ నీ వయస్సెంత?"

"పదహారు."



"ఇంతేనా? నిజంగానా? మరి దేనికి నవ్వుతున్నావు?"

"లగ్గ మయినాక భార్యను పెనిమిటి ఉమరెంతని అడుగుతారా? అట్లడిగితె నవ్వరా? మరి మీరు దేనికి నవ్వుతున్నరు? నేను గింత దొడ్డు గున్ననని, ఎత్తు గున్ననని కదూ!"

"కాదు. పదహారేళ్ళకే ఇంతలావుగా, ఎత్తుగా ఏపుగా ఎదిగావే, ఇంకో నాలు గయిదేండ్లు గడి స్తే ఇంకా ఎంత లావుగా, ఎత్తుగా ఎదుగుతావో అని."

"మీ కా ఫిక రే మక్కర్లె. మా ఇంట్ల లగ్గమయినాక ఇంక ఎదగరు, దొడ్డుగ్గారు. మా అక్కలు అంతా అంతే."

"అలాగా! అయితే నయమే."

"ఈ నెలదినాలకే కొంచెం బక్క గయినానని మీ వదినగా రన్నది. ఆవులిస్తున్రు. నిద్రొస్తున్నదా? అయితే నేనుకూడ..."

"ఏంలేదు."

"మీ రన్నాక తాగినరనే అనుకొన్నను. ఒట్టిదే నన్నమాట. మంచిది. ఉండుండ్రి-మీ వదినగారు మంచి మంచి కారా, స్వీటు చేసి నది. నే తెచ్చిన. గరమ్ గరమ్గ పాలున్నయి."

"తినిపి స్తే తింటా."

"ఇంక నయం. తాగిపి స్తె తాగుతనన్ల."

"ఏమిటి బీరా?"

"కాదు. గరమ్ దూద్-వేడి పాలు."

రమేశ్ ఆమెను దగ్గరకు తీసుకొని ముద్దాడబోయాడు.

సుందరి పెనుగులాడి, కౌగిలి విడిపించుకొని దూరంగా వెళ్ళబోతూ, "అయ్యబాబో! నిజంగానే తాగినరు. ముందు ఆకూ వక్కా వేసుకోండి. ఇలాచీ లిస్తా-నములుండ్రి" అన్నది. అంటూనే ఆమె నెమ్మదిగా ప్రక్క గదిలోకి వెళ్ళింది.

గమేశ్ చరచరా స్నానాల గదిలోకి వెళ్ళి పేస్టుతో పళ్ళు తోముకొని నాలుక గీసుకొని, సబ్బుతో ముఖం కడుక్కొని బాగా తుడుచుకొని వచ్చి, ట్యూబ్ లైటు వేసుకొని కుర్చీలో కూర్చొని వారపత్రిక చదవటం మొదలు పెట్టాడు.

నిండా పూలు పెట్టుకొని వచ్చి అతని ప్రక్కగా నిలబడింది. అతను తల ఎత్తలేదు.

"పాన్‌దాన్ తెచ్చిన...మంచిగుందా?" అతను సమాధానం చెప్పలేదు. తమలపాకులు, వక్కలు, సున్నం, ఏలకులు, లవంగాలు పెట్టుకొనే కంచుతో చేసిన ఆ చిన్న పెట్టె బల్ల మీద పెట్టి మూత తీస్తూ, ఆమె నెమ్మదిగా, "కోపం వచ్చిందా?" అని అడిగింది.

అతను నోరు మెదపలేదు. తల ఎత్త లేదు. సుందరి అతనికి కొంచెం దగ్గరగా జరిగి నిలబడి, తమలపాకులకు ఈనెలు తీసి పమిటకొంగుతో బాగా తుడిచి, కొంచెం సున్నం కాచు రాచి, ఏలకుల పొడి, వక్క పెట్టి, ఆకు మడిచి, లవంగం గ్రుచ్చి అతని చేతికి ఇస్తూ, "నేను మాట జారిన. ఏమనుకోకుండ్రి" అన్నది.

రమేశ్ తల ఎత్తి సుందరి ముఖంలోకి చూచి నవ్వుతూ, "నేను మనిషినే తూలాను. నేను అలా తూలిపోగా లేనిది, నువ్వు మాటజారితే తప్పొచ్చిందా! ఏంలేదు. అది సరేగాని, మరీ పల్లెటూరి పిల్లలా తలనిండా అన్ని పూలు పెట్టుకొన్నా వేమిటి? ఎక్కడి వివి? ఇంత పొద్దుపోయి మాలలు ఎవరు కట్టారూ? పూల సువాసనలేకాక ఈ అత్తరు ఘుమఘుమ లేమిటి? ఒట్టి అమాయకురాల వనుకున్నా. చాలా గడుసుదానవేనే! అయితే, నా తప్పును కమ్మేసుకొంటున్నా వన్నమాట!" అంటూ ఆమె చెయ్యి పట్టుకొన్నాడు.

ఆమె కిలకిలా నవ్వుతూ తమలపాకు చిలకలు ఒకటొకటే నోటికి అందించింది. అతను తాంబూలం వేసుకోవడం అయ్యాక, ఆమె నెమ్మదిగా అతని చెయ్యి విడిపించుకొని తలలో నుంచి కొన్ని మల్లె మాలలు తీసి, అడుగులో అడుగువేసుకొంటూ మంచం దగ్గరకు వెళ్ళి పరుపుమీద తలగడ ప్రక్కగా పెట్టింది. ట్యూబ్ లైటు ఆర్పి, బెడ్ లైటు వేసి మంచం చివర కూర్చొని, కావాలని ఆవులిస్తూ చిటికెలువేస్తూ, "చిన్న దొరవారికి కోపం పోయినట్టేనా?" అన్నది.

రమేష్ కుర్చీ దగ్గరకు లాక్కొని కాళ్ళు జాపుకొని కూర్చొని, "జ్ఞాపకం చేశావు గనుక పోలేదు. కొంచెం ఉన్నది. పూర్తిగా పోవాలంటే ఏవైనా పాటలు పాడాలి. నువ్వు ఏదైనా ఒక్క పాట పాడరాదూ?" అన్నాడు.

"నాకేం పాటలు రావు-బతకమ్మ పాటలు తప్ప."

"పోనీ అవే పాడు."

"గీడ్నా., నవ్వుతరు ఎవరైనా వింటే! మధ్యలో బతకమ్మను పెట్టి పదిమంది ఆడపిల్లలు చుట్టు తిరుగత, ఆడుత, పాడతరు."

"అలాగా! పోనీ ఇంకేదైనా పాడు. వరంగల్లో చిన్నప్పుడు నువ్వు పాటలు పాడితే పోటీలో ఫస్టుప్రైజు-మొదటి బహుమానం-వచ్చిందటగదా! మీ చిన్నన్నయ్య చెప్పాడు."

"గట్లనా! మాచిన్నన్న చెప్పినాడు? చిన్నగున్నప్పుడు పాడిన. మా మేన బావ నేర్పించిండు. అప్పుడైతె మహ జోర్‌దార్‌గ పాడిన. బండి ఎనక బండి కట్టి-గదేనా? కాక, నాంపల్లి టేషనుగాడీ-రాజాలింగో రామలింగో ...గదా?"

"ఏమో ఏదో నాకేం తెలుస్తుంది. ఏదో ఒకటి పాడు."

"ఇంక నయ్యం. ఎవరైనా వింటె నవ్వుతరు. అప్పుడు మీటింగ్ల పాడిన. బావ కూడ పాడిండు-పోటీలు అయినంక."

"ఏం మీటిం గది?"



"మరి అడగకుండ్రి. ఆ ముచ్చట మానుండ్రి" అంటూ సుందరి ముఖం మరో వైపు త్రిప్పుకొన్నది.

రమేశ్ వెళ్ళి మంచం మీద ఆమె ప్రక్కగా కూర్చొని గడ్డం పుచ్చుకొని తనవైపు త్రిప్పుకుంటూ, "ఏ మంతలో అంత కోపం వచ్చింది. నేనేం తప్పుమాట అన్నానా? ఏదో పాట పాడమంటే అలా మూతి ముడుచుకొన్నావు. మాటిమాటికీ ఎవరైనా వింటే నవ్వుతారు అంటవు, ఏమిటి సంగతి?" అని బుజ్జగిస్తూ అడిగాడు.

"అటువంటి పాటలు పార్టీ మీటింగ్ల పాడతరు. అవి ఇక్కడ పడగ్గదిల పాడతరా! ఎవరైనా వింటె నవ్వరా మరి!" అన్నది సుందరి.

"అల్లాగా. నరే పోనీలే" అని అత నంటే, ఆమె అతని కళ్ళల్లోకి చూచి నవ్వుతూ, "పోనీ మీరు పాడుండ్రి" అన్నది.

అతను నవ్వుతూ, "నేనా! నాకు ఆధ్యాత్మ-రామాయణ కీర్తనలు తప్ప మరేమీ రావు. అవి ఇక్కడ పాడరు గదా" అన్నాడు.

"ఆ మాట నా కెరికే. మీకు వేరె పాటలొచ్చు. మొన్న నోసారి మీ వదినగారూ, ఆమె బిడ్డలు కూర్చొని ఉండగా మీరు ఎంకిపాటలు పాడినరు. జానవద గీతాలు పాడినరు. చాల మంచిగున్నయి. తలుపుసాటునుండి నేను విన్నను. అంతలో మీ అమ్మగా రొచ్చిన్రు-దబదబ ఎక్కడివాళ్ళు అక్కడ తప్పుకొన్రు, అవునా?" అని ఆమె రెట్టించింది.

అందుకు అతను నవ్వుతూ, ఆమె భుజంమీద చెయ్యివేసి, "అమ్మదొంగా! ఎంత గడుసుదానివి! విన్నావు కనుక అబద్ధాలాడను. కాని ఇప్పుడు మూడ్ లేదు. పైగ దోసా" అని ఆగాడు.

"నా ముంగట పాడాలంటే మీకు సిగ్గుగుందా!" అంటూ సుందరి ముసిముసి నవ్వులు నవ్వింది-తలలో పూలుతీసి ఒకటొకటే పరుపు మీద విసురుతూ.

'మనిషి కొంచె మోటుగా ఉన్నది కాని, మన సెంత నాజూకైనది' అనుకొంటూ అతను ఆమెకు మరింత దగ్గరగా జరిగాడు.

"అమ్మాయి సుందరీ! అందరం కలిసి గుడికి వెళదాం. త్వరగా నీళ్ళుపోసుకొనిరా."

"నేను నీళ్ళోసుకోవడం ఏమిటీ?" పెద్దగా నవ్వింది సుందరి. కొన్ని క్షణాల తర్వాత నవ్వుతూనే, "మాఊర్లల్ల నీళ్ళోసుకోవడం అన్నా నీళ్ళాడడం అన్నా ఒకటే. స్నానం చేసి రమ్మంటారు... గంతెనా?" అన్నది.

"అవునమ్మా, చిన్న దొరసానీ!"

"గట్లని మా ఇంట్ల పనివాళ్ళంటరు. మీరట్లనరాదు-మనది అక్కా చెల్లెండ్ర వరసాయె!

"సరె. ముందుపద."

"గట్లనె. దబదబ ముఖం కడుగుత. స్నానం చేస్త. జల్ది వస్త" అంటూ సుందరి స్నానాల గదివైపుకు వెళుతుంటే యశోదమ్మగారు నవ్వుతూ, ఆగమని చేత్తో సంజ్ఞచేస్తూ,

"అది సరేగానీ! రాత్రి ఆ పూలమాలలన్నీ-మన నలుగురికోసం కట్టి ఉంచినవన్నీ-తీసుకొని వెళ్ళావు. ఏం చేశా వేమిటి?" అని అడిగింది. ఆమె సమాధానం చెప్పకముందే. "ఏం-మాకెవరికీ అక్కర్లే దనుకొన్నావా?" అని గదమాయిస్తున్నట్లు నటించింది.

"మీ బిడ్డలకేమో ఇంకా పెళ్ళి కాలేదాయె. పైగా సినిమకు పోయినారాయె... అందుకని."

"సరె వాళ్ళ విషయం వదిలేయ్. మరి నావంతు?"

"బావగారు పెద్దమనిషాయె..."

ఆ మాట విని యశోదమ్మగారు పగలబడి నవ్వుతూ, "అదేమిటి మగవాడు పెద్దమనిషి కావడం ఏమిటి? నువ్వూ, నేనూ అవుతాము. అయ్యాము ఎప్పుడో. ఇంక మరో అర్థం అయితే... ఆయన ఎప్పుడూ పెద్దమనిషే" అన్నది.

"గట్లనా! పెద్దమనిషి అంటె వయసు మళ్ళిన మనిషి. గా డట్లనే అంటరు. దీని కింత నవ్వుతరా!" అన్నది సుందరి ఆశ్చర్యం ప్రకటిస్తూ.

"ఇందాక నువ్వు త్వరత్వరగా నీళ్ళుపోసుకొని రా అంటే నవ్వలా మరో అర్థం తీసి. అలాగే నేనూ."

"యారా లనిపించిన్రు."

"యారా లేమిటి?"

"ఏరాలు అంటే తోటికోడలు అన్నమాట. తెలిసిందా, వదినా!" అన్నాడు రమేశ్, పెద్ద టర్కీ తువ్వాల భుజాన వేసుకొని చావడి గదిలోకి వస్తూ.

"ఓహో అల్లాగా" అన్నది యశోదమ్మగారు నవ్వుతూ.


భర్తనుచూసి సిగ్గుపడి గబగబా స్నానాల గదివైపుకు వెళ్ళింది సుందరి. అంతలో వెనుతిరిగి అంత త్వరగానూ చావడిలోకి వచ్చింది.

యశోదమ్మగారు ఆమె దగ్గరకు వెళ్ళి, "ఏం అలా లేడి పిల్లలా పరుగెత్తుకొని వచ్చావు?" అన్నది.

"పురుష సింహం ఎదురైతే!" అన్నది సుందరి, మాటలు పట్టిపట్టి మాటాడుతూ.

"అబ్బో చాలా గడుసుదనం నేర్చుకొన్నావే ఈ నెల రోజులలోనే" అని క్షణ మాగి, "నువ్వలా అనకూడదు. ఆయన పెద్దవారు. పెద్దమనిషి-వృద్ధుడని ఇందాక నువ్వేగా అన్నావు" అంటూ నవ్వింది.

"బావగారు కనుక నవ్వులాట కన్నను. ఇంకెప్పు డనను" అని అంటూనే, సుందరి రామారావుగారి వంక చూచింది. ఎంత అందగా డీయన-అనుకొన్నది ఒక్క క్షణం. ఈ వయసులో కూడా ఈయన ఇంత అందంగా,






ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా ఉన్నారే... మరి చిన్నప్పుడు ఇంకెంత బాగుండే వారో! అని కూడా అనుకొన్నది. 'ఎలా ఉండిఉంటారబ్బా' అని మళ్ళీ మళ్ళీ తన భర్త వంక చూస్తూ ప్రశ్నించుకొన్నది. 'ఆ ఇప్పుడు సమాధానం దొరికింది' అనుకొంటూ మళ్ళీ రామారావుగారి వంక చూచింది. అంతలో సిగ్గుపడ్డది.

సుందరి అలా తల ఎత్తి తన భర్తవంకా, రమేశ్‌వంకా మార్చిమార్చి చూడడం, తన భర్త అందచందాలు పరిశీలించడం, అంతలో తలవంచుకొని ముసిముసి నవ్వులు నవ్వడం, సిగ్గుపడడం గమనించి యశోదమ్మగారు కోపం నటిస్తూ, "ఇంక జాగుచెయ్యకు పద. ముందు స్నానానికి పద" అన్నది కొంచెం గట్టిగా ఏదో మందలిస్తున్నట్లుగా.

రామారావుగారు భార్యను చూచి నవ్వుతూనే, "ఏమిటే తగూ చిన్నపిల్లతో?"

సుందరి చప్పున స్నానాల గదివైపు నడిచి, తలుపుచాటున నిలబడి కొంచెం పెద్దగా, "ఇంతకుముందు మీ తమ్ముడుగారేమో మీ బిడ్డలిద్దర్నీ చిన్న పిల్ల లన్నారు. ఇప్పుడు మీరేమో నన్ను చిన్నపిల్ల నంటున్నరు" అని ఆగి-"అక్కగారూ! బావగార్ని దుఖణం నుంచి మూడు పాల సీసాలు తెమ్మనండి" అని పెద్దగా నవ్వి, చప్పున తలుపు గడియవేసుకొన్నది.

×× ×× ××

"ప్రొద్దుట దేవాలయానికీ, సాయంత్రం సినిమాకూ ప్రోగ్రాము నిర్ణయించావు. ఏమిటి, వదినా, ఈ వరుస కార్యక్రమాలు?"

"ఏముందీ? మీనాక్షీ కాత్యాయినీ మద్రాసు వెళ్ళిపోతున్నారు. అందుకని..."

"ఏం-అప్పుడే తొందరేమొచ్చిందీ?"

"కాలేజీలు తెరిచారు. పై చదువులు చదువుదా మంటున్నారు. అదీ కాక ఇక్కడ వాళ్ళకేం తోచడంలేదట. వేసంగి సెలవులు కాగానే పంపిస్తామని మాఅమ్మా వాళ్ళకు మరీ మరీ చెప్పి తీసుకొని వచ్చాను. మరి పంపొద్దూ?"

"వాళ్ళు వెళితే నాకు తోచదు."

"నీకు తోచకపోవడం ఏమిటీ...సుందరి ఉందిగా?"

"సుందరి మాట వేరు."

"మాట వేరుగా ఉన్నా, బుద్ధిమంతురాలు అని నువ్వేగా అన్నావు."

"ఆ మాటకు కాదు నే నన్నది. ఈ మధ్య ప్రతిదానికీ వేరే అర్థాలు తీస్తున్నారు ప్రతివారూ...ఏమిటో కారణం?"

"అవన్నీ అలా ఉంచు. నువ్వు సాయంత్రం కాస్త పెందరాళే ఇంటికి రా! పిల్లలనూ, సుందరినీ తీసుకొని సినిమాకు వెళ్ళి వద్దువుగాని."

"ఓకె. అల్లాగే! కాని...నువ్వూ,అన్నయ్యా రారా మరి?"

"రాము. ఇంట్లో పని ఉన్నది. పిల్లల ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేస్తున్నా. పచ్చళ్ళు తీసి చిన్న జాడీలలో సర్దాలి."

"అయితే సరే! మరి అన్నయ్యను కారు ఇంట్లో వదిలేసి వెళ్ళమను. క్లబ్బుకు వెళ్ళవలసివస్తే రిక్షాలో వెళ్ళమను."

"అల్లాగే."

"కాని, అన్నయ్య ఒప్పుకోడేమో! మమ్మల్నే రిక్షాల్లోనో, గుఱ్ఱపుబండీలోనో వెళ్ళమంటాడు. ఆజ్ఞలు జారీ చేస్తాడు. అల్లా వీల్లేదని నువ్వు గట్టిగా చెప్పాలి మరి."

"అలాగే చెప్పి ఒప్పిస్తాను. అయితే, రమేశ్, నువ్వుమాత్రం ఓ మాట మర్చిపోవద్దు. కారు జాగ్రత్తగా నడపాలి. పిల్లలను వదిలి కారుందిగదా అని స్నేహితుల ఇండ్లకు పోకూడదు. సరేనా?"

"పిల్లలంటే మీనాక్షీ వాళ్ళ విషయమేనా? సుందరి విషయం కూడానా!"

"నాకు ముగ్గురూ ఒక్కటే."

"తోటికోడలంటే అంత ఆపేక్ష దేనికో!"

"పెద్దపెద్ద మాటలు కట్టిపెట్టి ఇంక వెళ్ళి నీ పని చూసుకో. నాకు అవతల చాలా పని ఉన్నది" అని లోపలకు వెళ్ళబోతుంటే రమేశ్ పెద్దగా-

"అది సరేగాని, వదినా! మీనాక్షి వాళ్ళను అక్కడా, నన్ను ఇక్కడా పెంచడంలో అసలు ఉద్దేశం ఏమిటీ?" అని అడిగాడు.

యశోదమ్మగారు నివ్వెరపోయి అతని వంక ఒక్క క్షణం అలా చూచి, "ఏమిటి నీ ఉద్దేశం?" అన్నది.

అందు కతను చిరునవ్వు నవ్వుతూ, "కన్న కూతుళ్ళను పుట్టినింట వదిలి, మరిదినైన నన్ను పెంచడం ఏమిటీ అని..." అని ఆగితే,

ఆమె-"ఏం లేదు. అక్కడ యావదాస్తికీ వాళ్ళు వారసులు. ఇక్కడి ఆ ఆస్తికి నువ్వు వారసుడవు. ఆ ఆస్తి దక్కించుకోవాలంటే ఎక్కడివాళ్ళు అక్కడే పెరగాలి" అన్నది ఆవిడ.

"నీ మాటలు నాకు బొత్తిగా అర్థం కావటం లేదు. కొంచెం వివరంగా చెప్పు."


"నా కా అవసరమూ లేదు; తీరుబడీ లేదు."

"పోనీ ఒక్కమాట చెప్పు. నువ్వూ, మానాన్న చూచినంత ప్రేమగా నన్ను మాఅమ్మ చూడదేం? నన్ను ఒక్కసారి కూడా పూజా మందిరంలోకి రానివ్వదేం?"

"నాకు తెలియదు. పోయి వాళ్ళనే అడుగు. కాని, ఒక మాట నాకు తెలును. అత్తగారికి మడీ, ఆచారం ఎక్కువ. ఆవిడ నన్నుగానీ, మీ అన్నగారినిగానీ తన పూజా మందిరంలోకి రానివ్వదు. మరి నే నెవ్వరి నడగను?"

"అబద్ధం. ఆడవాళ్ళు అబద్ధాలాడితే అతికిన ట్లుంటుంది. అవునా?"

"నీ ఇష్టం వచ్చిన ట్లనుకో! నా కవతల



చాలా పని ఉన్నది" అంటూ యశోదమ్మగారు లోపలకు వెళ్ళింది.

×× ×× ××

రమేశ్ ఆ రోజు సాయంత్రం నాలుగింటి నుంచే ముస్తాబు కావడం మొదలు పెట్టాడు. క్రొత్తగా కుట్టించిన సూటు వేసుకొన్నాడు. మీనాక్షీ వాళ్ళను త్వరగా తెమల మన్నాడు. సుందరికి కూడా ఆ మాటే వాళ్ళచేత ఒకటికి రెండుసార్లు చెప్పించాడు.

మీనాక్షి, కాత్యాయినీ ఒకే రకం సన్నటి జరీ అంచు పట్టు లంగాలూ, జాకెట్లు వేసుకొన్నారు. పైన వేసుకొన్న వోణీలు కూడా ఒకేమదిరిగా ఉన్నాయి. తలలో చెరొకటీ గులాబీలు అలంకరించుకొన్నారు.

సుందరి పెద్ద జరీ అంచు బెనారస్ పట్టుచీర కట్టింది. ఖద్దరు సిల్కు జాకెట్టు వేసుకొన్నది. జుట్టు బాగా దువ్వుకొని చుట్ట చుట్టుకొని పిన్నులు పెట్టుకొన్నది. ముఖానికి బాగా పౌడరు రాచుకొన్నది. మెడమీద, కంఠంపైనా ఒకటికి రెండుసార్లు పౌడరు అద్దుకొన్నది. మెళ్ళో రెండు పేటల గొలుసు చాలదన్నట్లు రాళ్ళ నెక్లెస్ వేసుకొన్నది. చెవులకు చాలా ఖరీదైన రాళ్ళ దిద్దులు పెట్టుకొన్నది. చేతులకు రెండు జతల బంగారపు గాజులు తొడిగింది.

"ఇంక బయలుదేరదామ్ పద. బాబాయి వాకిట్లో కారు దగ్గర మనకోసం వెయిట్ చేస్తున్నాడు" అంటూ మీనాక్షి, కాత్యాయినీ చెరో చెయ్యి పట్టుకొని లాక్కొని వచ్చేదాకా సుందరి అలంకారాలు చేసుకొంటూనే ఉన్నది.

కారు తలుపు తీసి మీనాక్షి వాళ్ళు ఎక్కాక, రమేశ్ భార్యను చూచి చిరునవ్వు నవ్వుతూ, "నువ్వూ ఇక్కడేనా...ముందుకు వస్తావా?" అని ఒక్క క్షణం ఆగి మళ్ళీ, "సరే వాళ్ళతో కలిసి కూర్చో" అన్నాడు. సుందరి నెమ్మదిగా ముందుకు అడుగువేసింది. ఆమె బాగా దగ్గరకు వచ్చాక ఎగాదిగా చూస్తూ, "ఏం పేరంటానికి వెళుతున్నా మనుకొన్నావా?" అని నెమ్మదిగా అడిగాడు.

"కాదులెండి. మరి మీరేమో సూటు బూటు వేసి-అందుకని" అంటూ లోపలకు అడుగుపెట్టి సర్దుకొని కొంచెం పెద్దగా, "ముందిన్ని చాయ్ పోయిస్తరా, లేదా?" అన్నది.

"ఓ. దానికేం భాగ్యం! ముందక్కడికే వెళదాం" అన్నాడు రమేశ్.

"బాబాయ్! చాయ్ అంటే టీ కదూ?" అని అడిగింది కాత్యాయిని.

"అవును" అన్నాడు రమేశ్.

"మాకు ఐస్ క్రీములు, కూల్ డ్రింక్స్ కావాలి" అన్నది మీనాక్షి.

"ఓ అలాగే! కాని, వదిన నాకు డబ్బు..." అని ఏదో చెప్పబోతుంటే సుందరి-

"ఏం ఫికరక్కర్లా. పైసలు నా దగ్గర మస్తుగున్నయి పదుండ్రి" అన్నది ధీమాగా.

"ఓకె. స్టేట్ బాంక్ ఆఫ్ హైదరాబాద్, వరంగల్ బ్రాంచి మన చేతుల్లో ఉన్నదన్న మాట" అని నవ్వుతూ ముందుకు వెళ్ళాడు రమేశ్.

×× ×× ××

"అదేమిటి హొటల్లో ఇంత మొహమాటపడుతున్నావ్! టిఫినూ, ఐస్‌క్రీమూ, కూల్ డ్రింక్సూ ఏమీ వద్దంటున్నావ్. టీ తప్ప ఏమీ ముట్టుకోవా?" అంటూ నవ్వాడు రమేశ్.

"సాయంత్రం పూట నాకు చాయ్ చాలు" అని ఆగి నవ్వుతూ, సుందరి-"అసలే ఇంత దొడ్డుగున్నను. ఇంక ఇవన్నీ తింటుంటె మరింత దొడ్డుగవుతను" అన్నది.

"ఐస్‌క్రీము తింటే లావు అవుతావని ఎవ్వరూ అనలేదు. నేను వినలేదు. మేమెప్పుడూ మద్రాసులో ఎన్నో రకాల ఐస్‌క్రీములూ తింటాము. మరి మేము లా వెక్కలేదే?" అన్నది కాత్యాయిని ముఖం గంభీరంగా పెట్టి.

"అదేంకాదులే. నవ్వులాట కన్నది" అని సుందరి వంకకు తిరిగి, "అవునా?" అని అడిగాడు రమేశ్.

"అవును. అదిగాక సర్ది చేస్తదని" అని సుందరి అంటే,

మీనాక్షి-"బాబాయ్! సర్ది ఏమిటీ?" అని అడిగింది నవ్వుతూ.

"జలుబు-కోల్డ్" అన్నాడు రమేశ్.


తేనీరు సేవించడం ముగించి, ముందుకు వంగి నెమ్మదిగా, "మీరు ఇవేమీ తీసుకోరా?" అని అడిగింది సుందరి.

రమేశ్ నవ్వుతూ, "నేనా? స్వీట్స్ తిన్నాను. కాఫీ తాగాను. ఇంకేం కావాలి. అయినా మనకు హాట్ డ్రింక్స్ తప్ప..." అని ఇంకా ఏమో అనబోతుంటే,

సుందరి- "వాళ్ళముందు ఆ ప్రస్తావన చేయకుండ్రి" అంటూ వారించింది.

అలా అంటూనే మీనాక్షి వాళ్ళు చూడకుండా తన పర్సు చేతికి అందివ్వబోతే అతను నవ్వుతూ, "అబ్బే వద్దు! నా దగ్గర డబ్బు చాలా ఉన్నది. ఊరికే అలా అన్నాను. మా వదిన ముందు మా అన్నయ్యా, మా అమ్మ ముందు మా నాన్న డబ్బు ఖచ్చితంగా లెక్క ప్రకారం ఇస్తారు. కాని, చాటుగా అందరి దగ్గరా నేను వసూళ్ళు చేస్తూంటాను. పద. వాళ్ళు నెమ్మదిగా వస్తారు" అంటూ బయటకు వెళ్ళాడు. సుందరి అతన్ని అనుసరించింది.

బయట కారు దగ్గర దర్జాగా సిగరెట్టు కాలుస్తూ నిలబడ్డాడు రమేశ్. సుందరి అతన్ని పరిశీలనగా చూసింది. తల వంచుకొన్నది. ఉండబట్టలేక అంటున్నట్లు నెమ్మదిగా, "మీ రిప్పుడు చాల మంచిగున్నారండీ" అన్నది. ఆమె ముఖంలో సంతోషపు పొంగు కనిపించింది.



"అలాగా!" అంటూ అతను ఆమె వంక కొంటెగా చూస్తూ అన్నాడు.

మళ్ళీ అంతలో, "ఇంటికెళ్ళినంక మీకు దిష్టి తీయించాలి సుమండీ" అన్నది.

అందుకు అతను-"ఏమలా అంటున్నావ్...నాకు కొంచెం ఒళ్ళు వచ్చిందనా?" అన్నాడు.

సుందరి-"మన లగ్గం నాటికంటె..." అని ఆగితే,

రమేశ్-"నీ మహత్యం కొంతా, బీర్ ప్రభావం కొంతా" అంటూ మాట కలిపాడు.

"గట్లనా!" అని నవ్వి క్షణమాగి స్వరం తగ్గించి, "బీరు మస్తుగా తాగితె దొడ్డు గవుతరని విన్నను కాని..." అని, అంతలో మీనాక్షి వాళ్ళు వస్తే చప్పున అటుతిరిగి,

"పెళ్ళి కాక ముందే పాన్ గిట్ల వేస్తరా పిల్లలు" అని, మళ్ళీ భర్త వంకకు తిరిగి-"మీరు జర కట్టు దిట్టం చెయ్యాలి సుమండి" అన్నది.

×× ×× ××

సినీమా హాల్లో వాళ్ళు నలుగురూ పక్కపక్కనే కూర్చున్నారు. ఆట సగం అయ్యాక విశ్రాంతి సమయంలో అందరూ బయటకు వచ్చి సోడాలు తాగారు.

స్నేహితులు కనిపిస్తే రమేశ్- "హలో సుజాతా! హలో గోపాల్!" అంటూ ముందుకు వెళ్ళాడు. వాళ్ళ దగ్గరకు వెళ్ళాగానే సిగరెట్టు ముట్టించాడు. మీరు వెళ్ళి కూర్చోండి అన్నట్లు సంజ్ఞలు చేస్తే, మీనాక్షి వాళ్ళు లోపలకు వెళ్ళారు. సుందరి అక్కడే నిల్చున్నది. కొన్ని నిమిషాల తరవాత రమేశ్ స్నేహితురాలనూ, ఆమె అన్నగారినీ వెంట పెట్టుకొని వచ్చి, "ఈయన నా స్నేహితుడు గోపాల్‌గారు. ఈమె నా క్లాసమేట్ సుజాత" అంటూ సుందరికి పరిచయం చేస్తే, ఆమె "నమస్కారం" అన్నది.

రమేశ్ గోపాల్ వంకకు తిరిగి "షి ఈజ్ మై వైఫ్. పేరు సుందరి" అన్నాడు.

"బ్యూటిపుల్. గ్లాడ్ టు మీట్ యు" అన్నాడు గోపాల్.

"నమస్తే" అన్నది సుందరి చిరునవ్వు నవ్వుతూ 'బతికించింది' అనుకున్నాడు రమేశ్.

ఇంతలో గంట వినిపించేసరికి సుందరి ముందుకు నడుస్తూ "పదుండ్రి" అన్నది.

అందుకు రమేశ్ నెమ్మదిగా-"నువ్వు వెళ్ళి కూర్చో. నేను...మేం ముగ్గురం వస్తాం" అన్నాడు, సిగరెట్టు మరో దమ్ము లాగుతూ.

"అబ్బే ఎందుకూ ...మనం వెళదాం" అంటూ సుజాత రమేశ్ పక్కకు వెళ్ళింది.

సుందరి ముందుకు నడిచింది. గుమ్మం దగ్గర మెట్లు దిగి హాల్లోకి అడుగు పెడుతున్నప్పుడు 'బి కేర్‌ఫుల్' అంటూ గోపాల్ ఆమెను స్పృశింపబోయాడు. ఆమె చప్పున పక్కకు తప్పుకొన్నది. అతను దగ్గరకు వచ్చినప్పుడు గుప్పున దుర్వాసన వచ్చింది. అతను బాగా తాగి ఉన్నాడని ఆమెకు అనుమానం కలిగింది. సుందరి చరచరా ముందుకు వెళ్ళి మీనాక్షినీ, కాత్యాయినీ వాళ్ళను తీసుకొని దూరంగా వెళ్ళి కూర్చున్నది. అయిదారు నిమిషాల తరవాత రమేశ్‌నూ, సుజాతనూ వెంట పెట్టుకొని గోపాల్ వాళ్ళ దగ్గరకు వచ్చి, "హూ ఆర్ దీస ఏంజెల్స్" అని, తనకు పరిచయం చెయ్యమన్నాడు. రమేశ్ క్లుప్తంగా పరిచయం చేశాడు. మీనాక్షి అతని వాలకం కనిపెట్టి తను ఒక్క మాట మాట్లాడలేదు. కాత్యాయినినికూడా మాట్లాడనివ్వలేదు. సుందరి వాళ్ళ ఇద్దరినీ తీసుకుని దూరంగా వెళ్ళి కూర్చున్నది.

బాల్కనీలో చాలా వరుసలలో చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి. అందువల్ల ఎవరు ఎన్ని సార్లు సీట్లు మార్చినా, ఏ గొడవా చేసినా ఇతరులు ఎవరూ పట్టించుకోలేదు. ఆట అయిపోడానికి ఇంకో పావుగంట ఉందనగానే సుందరి బావగారి కూతుళ్ళను వెంట



పెట్టుకుని బయటకు వెళ్ళింది. రమేశ్‌కూడా బయటకు వచ్చి ఇంకో పావు గంట ఉండ మనీ ,సుజాతా వాళ్ళను తప్పని సరిగా ఇంటి దగ్గర దింపి రావల సిన అవసరం ఉందనీ అంటే మీనాక్షి-


"పిన్ని ఇందాక చాలా భయపడింది, బాబాయ్! చాలా సేపు ఏడిచింది. అదీగాక సినిమా ఏమీ బాగాలేదు. అందుకని ముందు మమ్మల్ని ఇంటి దగ్గర దింపి, నువ్వే మళ్ళీ రా కావాలంటే "అన్నది.

రమేశ్ తటపటాయి స్తే-

"ఇదే మద్రాసయితే ఎక్కడ పడితే అక్కడ టాక్సీలు దొరుకుతాయి. కాని, ఇక్కడ దొర కవు. పోనీ రెండు రిక్షాలు మాట్లాడి వెళ్ళు " అన్నది.

రమేశ్ విధిలేక వాళ్ళను కారులో ఇంటికి తీసుకుని వెళ్ళి దిగవిడిచి వచ్చి, హాలు గేటు దగ్గర సుజాతా వాళ్ళను కలుసుకున్నాడు.

×× ×× ××




## 3

రమేశ్ ఇంటికి తిరిగి వచ్చేసరికి రాత్రి ఒంటి గంట దాటింది.

మీనాక్షి, కాత్యాయిని భోజనా లప్పుడే సినిమా హాలులో జరిగిన గొడవంతా తండ్రికి వివరంగా చెప్పారు. అన్నాలు తినడం అయ్యా క కూతుళ్ళను మేడమీదకు తీసుకుని వెళు తూ రామారావుగారు-"ఈ విషయం తాత య్యతో చెప్పవద్దు" అని బతిమలాడారు.

యశోదమ్మగారు ఎంత బతిమిలాడినా సుందరి ఆ పూట భోజనం చెయ్యలేదు. కాసిని మజ్జిగ తాగి హాలులో సోఫాలో కూర్చు న్నది.

"మొహం అంతా అలా కంది పోయిం దేమిటి. సినిమాలో హీరోమీద విలన్, అతని జట్టు వాళ్ళు తుపాకులతో కాలుస్తున్నప్పుడు భయపడ్డావుట! చాలా సేపు వెక్కి వెక్కి ఏడ్చా వుట. నీ మనసు అంత సున్నితమని అనుకో లేదు. నువ్వు చివరిదాకా ఉండవల సింది. కథానాయకుడికి పదిమంది డాక్టర్లు ఆపరే షన్ చేసి గుండ్లు తీ సేస్తారు. తరవాత సినిమాలో కథానాయకురాలితో ప్రేమగీతాలు పాడతాడు. ఈ మధ్య ఏ సినిమా అయినా ఇంతే. ఈ మాత్రానికి నువ్వింత ఏడ్వకూడదు" అంటూ ఓదార్చింది. సర్ది చెప్పింది. కొంత సే పు తరవాత, "రమేశ్ కోసం ఎదురు చూడకు. వాడు ఎంత పొద్దు పోయి వస్తాడో, ఏమో? నువ్వూ మేడమీదకు వెళ్ళి నా పిల్లలతో పాటు పడుకో. నిద్రపో" అంటూ ఆ మాటా ఈ మాటా చెప్పి పంపించింది.

రాత్రి పన్నెండు గంటల దాకా ఎదురు చూచి చెప్పలేనంత భయం కలిగే సరికి రమేశ్‌ను వెంట పెట్టుకుని తీసుకుని వచ్చే ందుకు బలవంత పెట్టి భర్తను సుజాత ఇంటికి పంపింది యశోదమ్మగారు.

రామారావుగారు ఆ హాలులో రమేశ్ దగ్గర ఒక్క పదినిముషాలు కూడా కూర్చోలేక పోయా రు. దుర్వాసన భరించలేకపోయారు. అతన్ని అదుపులో పెట్టలేక పోయారు. చివరకు విసిగి "అసలు వీణ్ణి కారులోనే పడివుండ నివ్వవల సింది" అన్నారు.

"అలా అనుకొంటే అక్కడ ఆ సుజాతా వాళ్ళింట్లోనే ఉండనివ్వక పోయారా?" అని ఎదురు ప్రశ్న వేసింది యశోదమ్మగారు.

"ఊరు ఊరంతా అల్లరి అయ్యేది."

"ఇప్పుడు కానట్లు!"

"ఇళ్ళల్లో జరిగిన అల్లరి కాక వాడు ఆ పరిస్థితిలో కారు నడువుకొని వస్తే ఏం ప్రమాదాలు జరిగేవో! ఎంతమంది ఇంటికి వచ్చి అల్లరి చేసేవారో! ఆ నాటి కానాడు వీడి వ్యవహారం హద్దుమీరి పోతోంది."

ఆ మాటలు విని అప్పటిదాకా కాళ్ళు బార జావుకొని సోఫాలో పడుకొన్న వాడల్లా నెమ్మది గా లేచి నిలబడ్డాడు రమేశ్. "అసలు నువ్వు ఎవరు? న న్నిలా బలవంతాన లాక్కొని రావడానికి నీకు హక్కు ఎవరిచ్చారు? నేనేం తప్పతాగా ననుకొంటున్నావా-కారు నడువు తూ ఏక్సిడెంటు చెయ్యడానికి? హాట్ 69 బాటిల్ అంతా గోపాల్ ఖాళీ చేశాడు. నాకు కొంచెం బీరు ఇచ్చారు. కొంచెం నిషా వచ్చింది అంతే" అని ఆగి, రమేశ్ యశోద మ్మ గారి వైపు తిరిగి- "వదినా! నన్ను అన్న య్య అందరి ముందూ తిట్టి అవమానపరిచా డు. నన్ను ఈడ్చుకొని వచ్చాడు. నీ మొహం చూచి ఊరుకొంటున్నాను. మా నాన్నను పిలు. యావదాస్తి భాగాలు పంచుకోవా లసిందే. నువ్వు మధ్యవర్తిగా ఉండు. వాడు ఒప్పుకోక పోతే రేపు సుజాత వాళ్ళను పిలి పిస్తా. నేను తాగుబోతునై డబ్బు పాడుచేస్తా ననుకోకు" అని కొన్ని క్షణాలు ఆగి, రామారావు గారి వంక తిరిగి, "ఒరేయ్ అన్నయ్యా! నువ్వు కేవలం అమాయకుడిలా పోజు పెట్టకు. చదు వుకోసం వెళ్ళి విశాఖపట్నంలో ఎంతడబ్బు తగలబెట్టావో లెక్క గట్టిస్తా. సుజాత చెప్పింది లే. అక్కడ లైట్ హౌజ్ దగ్గర వాళ్ళ బంధువు లు ఉన్నారట. తెలిసింది. ఆ డబ్బు లెక్క గట్టి నీ వాటాలో తగ్గించాలి. ఏమంటావ్?" అని పెద్దగా అరిచాడు.


రామారావుగారికి తల తిరిగిన ట్లయింది, పట్టరాని కోపం వచ్చింది. అనుకోకుండానే ఆయన చెయ్యెత్తారు. ఓ అడుగు ముందుకు వేశారు కూడానూ.

యశోదమ్మగారు చప్పున అడ్డువచ్చి ఆయ న్ను చెయ్యి పట్టుకొని అవతలకు లాక్కొని వెళుతూ "మీరు చెయ్యి చేసుకొంటే నే నూరు కోను. ఉన్న పరిస్థితిలో రమేశ్ కూడా ఊరు కోడు. ఏదైనా గొడవ అయిందంటేమేడమీద నుంచి అందరూ దిగి వస్తారు. ఎవరి మాట ఎలా ఉన్నా, మామగారు బాధపడతారు. ఆయన రమేశ్ బాధ్యత అంతా మొదటే నాకు వప్పగించారు. పెంచి పెద్దవాణ్ణి చేశా ను. పెళ్ళి చేశాను. అతనికి విశ్వాసం లేదని తేలిపోయింది. కనీసం మీకైనా కొంచెం విశ్వా సం ఉంటే ఇంక ఇంతటితో ఈ గొడవ కట్టిపెట్టండి" అన్నది.

ఆ పైన ఆయన నోరెత్తలేదు.

కాని, రమేశ్ పెద్దగా అరుస్తున్నట్లు- "ఇదు గో, వదినా! నా మీద అభాండాలు వెయ్యకు. విశ్వాసం ఉంది కనుకనే నిన్ను మధ్యవర్తిగా ఉండమన్నాను. తెలిసిందా?" అన్నాడు. అతను అలా అంటూనే తూలుతూ వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు.

యశోదమ్మగారు భర్తను లోపల గదిలోకి తీసుకొని వెళ్ళింది. ఆ గదిలో కుర్చీలో తల పట్టుకొని కూర్చున్నా రాయన. మంచినీళ్ళు,




మజ్జిగ తీసుకొని పావు గంట తర్వాత ఆవిడ హాల్లోకి తిరిగి వచ్చింది.

రమేశ్ వీధిగుమ్మంమీద కూర్చుని వాంతి చేసుకొంటున్నాడు. ఆవిడ గబగబా వెళ్ళి అతని వెనకగా నిలబడి, రెండుచేతులతో చెవులు మూసి కణతలు నొక్కుతూ తల పట్టుకొన్నది. అతనికి మళ్ళీ వాంతి అయింది. నీళ్ళు అందిస్తే పుక్కిలించి ఉమ్మేసి, మిగతావి గటగటా త్రాగాడు. నెమ్మదిగా లేవదీసుకొని వచ్చి సోఫాలో కూర్చోపెట్టి రెండు గ్లాసుల మజ్జిగ పడితే త్రాగి కాళ్ళు జాపుకొని పడుకొన్నాడు. కొన్ని క్షణాల తర్వాత, "వదినా! నా తల పగిలిపోతున్నది" అని అంటే, యశోదమ్మగారు అమృతాంజనం తెచ్చి కణతలకు రాచింది.

×× ×× ××

సుందరి తెల్లవారి ఆరు గంటలు దాటాక హాల్లోకి వచ్చి చూచేసరికి రమేశ్ సోఫాలో యశోదమ్మగారి ఒడిలో తల పెట్టుకొని ఇంకా అలాగే నిద్రపోతున్నాడు. నెమ్మదిగా యశోదమ్మ గారిని నిద్ర లేపింది. ఆవిడ లోపలకు వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చే లోపున తను టీ త్రాగి, ఆవిడకు కాఫీ తెచ్చి ఇచ్చింది. ఆవిడ కాఫీ చప్పరిస్తూండగా దగ్గరగా నిలబడింది.

నెమ్మదిగా-"ఇన్నాళ్ళూ యారా లనుకొన్నను. అట్లనే మాట్లాడిన" అని ఆగి, చిరునవ్వు నవ్వి అంతలో ముఖం గంభీరంగా పెట్టి, "నిజం చెప్పుండ్రి. ఆయన లగ్గంకాక ముందు మీకు పుట్టిన కొడుకా, కాక సవతి కొడుకా? మొన్న నోసారి బావగార్ని చూసిన తర్వాత రమేశ్ గార్ని చూచిన. గట్లనే అనిపించింది" అని ఆమె ముఖంలోకి చూచింది.

యశోదమ్మగారు చాలా బాధపడుతున్నట్లు స్పష్టంగా కనిపించింది.

అందుకే సుందరి మరోసారి అడగలేదు. అదీకాక అంతలో రామారావుగారు అక్కడికి వచ్చారు. ఆయన్ను చూచి సుందరి తప్పుకొని లోపలకు వెళ్ళబోతుంటే యశోదమ్మగారు ఆగమని నంజ్ఞచేసింది.

"ఏమిటి...ఏదో మాట్లాడుకొంటూ మధ్యలో ఆపేశారు?" అని అడిగారు రామారావుగారు.

"పూర్వం సుజాతకు కలిగిన అనుమానాలే ఇప్పుడు సుందరికీ కలిగాయి. వీటి అన్నింటికీ కారణం మీరు" అని ఆగి, నవ్వుతూ యశోదమ్మగారు,-"మీకూ, రమేశ్‌కూ అంత మరీ దగ్గర పోలికలు ఉండడంవల్ల, మీ ఇద్దరికీ మధ్య అంతరం ఎక్కువ ఉండడం వల్ల ఇంట్లో వాళ్ళకూ, బయటవాళ్ళకూ అనుమానాలు వస్తున్నాయి" అన్నది.

రామారావుగారు నవ్వి ఊరుకొన్నారు. కొన్ని క్షణాల తర్వాత నెమ్మదిగా, "బయటివాళ్ళ విషయం మనం పట్టించుకో నక్కరలేదు. ఏదో అంటారు" అన్నారు ఆయన.

"సుందరి ఈ ఇంటి కోడలు కనుక, ఇంట్లో మనిషి కనుక సమాధానం చెప్పవలసిన అవసరం లేదంటారు...అవునా? ఎలా అయినా, లాయరుగారు కదా మీరు. పాపం చాలా శ్రమపడ్డారు. ఉండండి మంచి కాఫీ ఇస్తాను" అంటూ యశోదమ్మగారు వంట ఇంట్లోకి వెళ్ళింది.

భార్య అటు వెళ్ళగానే ఆయన సుందరి వంకకు తిరిగి, "ఏమమ్మా, సుందరీ! రాత్రి సినిమాలో మీ బావ జ్ఞాపకానికి వచ్చి ఏడ్చావుట ఏమిటీ?" అని అడిగారు.

సుందరి ఏమీ మాట్లాడలేక పోయింది.

కొన్ని క్షణాల తర్వాత ఆయన-"వాళ్ళంతా ఎక్కడ ఉంటారూ?" అని అడిగి- క్షణం ఆగి-'వెళ్ళి చూచిరావాలని ఉంటే వెళ్ళు. యశోదమ్మకూడా వస్తుంది" అన్నారు.

సుందరి ఓ మాట చెప్పా లనుకొన్నది. ఆయన ముందు చాలా సిగ్గుపడిపోయింది. సుందరి భయపడింది కూడానూ. తల వంచుకొని నెమ్మదిగా ప్రక్క గదిలోకి తప్పుకొన్నది.

×× ×× ××

ఆ పూట అంతా సుందరి రమేశ్‌తో మాట్లాడలేదు. సాధ్యమైనంతవరకు తప్పించుకొని తిరిగింది. రాత్రి భోజనాల సమయంలో ఆమె రమేశ్‌తో నెమ్మదిగా, "ఆ పోరితో మీ రట్ల చనువు గుండడం, సరసా లాడడం నా కయితె మంచి గనిపించలేదు" అన్నది.

అందుకు రమేశ్ వెంటనే, "నీకు బాగుండలేదేమో కాని, నాకు బాగుంది. సరేనా?" అన్నాడు.

"గట్లనా!" అని క్షణమాగి, "ఆమె అన్న ఒట్టి పోకిరిలా ఉన్నడు. మీకు వాళ్ళతో ఏమిటంత దోస్తి?"

"నువ్వు మాటలు మర్యాదగా రానీయ్. ఆయన్ను పోకిరీ గీకిరీ అనకు...నాకు కోపం వస్తుంది. అనవసరంగా నాతో తగూ పెంచకు. అయినా, నా సొంత విషయాలు నీ కనవసరం."

"గట్లనా! ఏం కాదు."

"ఊరుకో, సుందరీ! మీ రిద్దరూ అన్నాల ముందు ఇలా తగూలాడుకోకండి" అంటూ యశోదమ్మగారు కల్పించుకొని సర్ది చెప్పబోయింది.

"మీ రూకోండి. నా పెనిమిటి విషయం అడగడానికి నాకు హక్కు ఉన్నది. బరాబరు అడుగుత" అని ఆగి, సుందరి రమేశ్ వంకకు తిరిగి, "నన్ను లగ్గమాడక ముందు మీ రెట్లున్నరో, ఏం చేసినరో మా నాయన కెరిక లేదు. ముందు విచారించలే దనుకొంటను. అందువల్ల మీ సంబంధం ఒప్పుకొన్నరు. ఇక్కడికి వచ్చినంక మొన్న మొన్న తెలిసింది-మీరు తాగుతరని. మా నాయన నా గొంతు కోసిండని అనుకొన్నను. ఊకొన్న. కాని, నిన్న సుజాత నడవడిక చూచినంక, ఆమె అన్నగారి నడవడిక చూచినంక ఊకోలేక పోతున్న...అందు కడిగిన. ఇంతకు మీ రేమంటరు?" అన్నది.

"నాబొంద... ఏమంటానూ! నువ్వూరికే రెచ్చగొడుతున్నావు. అభాండాలు వేస్తున్నావు. సుజాత యోగ్యురాలు. ఊరికే అలా అందరితో సోషల్‌గా ఉంటుంది. చదువుకొన్న పిల్ల: మంచి తెలివితేట లున్నాయి. గొప్ప సంస్కారం ఉన్న పిల్ల. తెలుసా?" అన్నాడు రమేశ్ పెద్దగా.

"మస్తుగ తాగిన అన్నగారితో కలిసి సినిమాకు వచ్చింది. పెండ్లంతో, అన్నగారి బిడ్డలతో కలిసివచ్చిన మిమ్మల్ని వేరు చేసింది. ఇంటికి తీస్కపోయి గింత సారాయి పోయించింది. అర్ధరాత్రిదాక మీరు గాడ్నే ఉన్నరు. ఏం తైతక్కలాడిందో నే చూడల. ఆమెగారి సంస్కారం నాకేమి ఎరుక. చెప్పుండ్రి వింటను. మావూర్లల్ల కల్లు పాకలకా

డ కొండ రాడోళ్ళు ఇట్లుంటరని విన్నను కాని. చూడలా" అన్నది సుందరి జంకూ గొంకూ లేకుండా.

"ఇదిగో, సుందరీ! నువ్వు మాటలు మిగులుతున్నావు. నువ్వు ఒట్టి అమాయకురాల వనుకున్నా ఇన్నాళ్ళూ. జాలిపడ్డాను. కాని, ఇప్పుడు చాలా గడుసుగా మాట్లాడుతున్నావు—అందులోనూ మావదినముందు. జాగ్రత్త" అంటూ రమేశ్ ఇంకా ఏదో అనబోతుంటే యశోదమ్మగారు అడ్డు తగిలి—

"ఇదుగో, రమేశ్! నువ్వు చదువుకున్నవాడివి. విచక్షణాజ్ఞానం కలవాడివి. సుందరి ఒట్టి అమాయకురాలు. మనసు బాధపెట్టకు. అదీ కాక అవతల మీనాక్షివాళ్ళున్నారు. వాళ్ళు వింటే బాగుండదు" అని సర్ది చెబితే అతను ఊరుకొన్నాడు కాని, సుందరి ఊరుకోలేదు.

ఆమె యశోదమ్మగారితో—"ఈయన మీ బిడ్డలకు తాగుబోతును పరిచయం చేసిండ్రు" అన్నది.

"అబద్ధం" అరిచాడు రమేశ్.

"కాదు. నేను నిజం చెప్పిన. పిల్చి అడుగుండ్రి!" యశోదమ్మగారి వంక చూస్తూ నెమ్మదిగానే సమాధానం చెప్పింది సుందరి. క్షణం ఆగి—"మీ బిడ్డల ముందు ఆ పోరి నాతో...వరాచికా లాడింది" అన్నది.

"ఎప్పుడు?" మళ్ళీ పెద్దగా అడిగాడు రమేశ్.

"రాత్రి సినిమాలో!"

"ఇదీ అబద్ధమే. నువ్వు క్లైమాక్స్ సీనులో ఎందుకో భయపడ్డావనీ, ఏడుస్తున్నావనీ కాత్యాయని వచ్చి చెబితే, నన్ను వద్దని సుజాత తను వచ్చి నిన్ను సముదాయించింది. అంతే. మీ బావ జ్ఞాపకం వచ్చాడని చెప్పావుటగా-అప్పుడేదో నవ్వులాటకు ఓ మాట అని ఉంటుంది. కాని, తప్పు మాట అనదు. పోనీ ఇప్పుడు చెప్పు ఏమన్నదో?" అన్నాడు రమేశ్.


సుందరి వెంటనే ఏమీ మాట్లాడలేదు.

కొన్ని నిముషాలు మరోవైపు చూస్తూ అలా స్తబ్దంగా ఉండిపోయింది.

×× ×× ××

"మా రమేశ్ బావగారూ. రామారావుగారూ పరమ రసికాగ్రేసరులు. పరమేశ్వరరావుగారూ. వారంతా ఉండగా మీ బావ ఎందుకు జ్ఞాపకం వచ్చాడూ? ఆ...వ స్త్రీమాత్రం ఏడుపెందుకు వచ్చిందీ?" అని అడిగింది సుజాత నవ్వుతూ.

"అదేమిటి—మా బాబాయి. మా నాన్నగారూ నీకు బావ వరుస ఎలా అవుతారూ?" అని మీనాక్షి అడిగితే: "పరమ శ్రోత్రియులు. సదాచార సంపన్నులు. వృద్ధులు అయిన మా తాతగారిని పట్టుకొని రసికాగ్రేసరులు అంటున్నావు... ఏమిటి సంగతి?" అంటూ కాత్యాయని నిలువదీసింది ఒకవంక నవ్వుతూనే.




"మాఅన్నయ్య రమేశ్‌గారిని బావగారని పిలుస్తాడు. నాకూ అదే వరస" అన్నది సుజాత.

"తాగినప్పుడు!" అన్నది సుందరి.

"మా అన్నగారు తాగగా మీరు చూశారా?" కోపంగా, గట్టిగా అడిగింది సుజాత.

"చూడనక్కర్ల. కండ్లెఱ్ఱగున్నయి. గాడ నిలబడితే గీడకు కంపుకొడుతున్నది." రపీమని నిర్భయంగా సమాధానం చెప్పింది సుందరి.

"ఓకె...సుందరిగారూ! మాఅన్నయ్య తాగుతాడు. నేను మంచిదాన్ని కాను. కాని, సినిమాలో హీరోను చూచి బావను జ్ఞాపకం చేసుకొని ఏడ్చును. తెలిసిందా. ప్రస్తుత సందర్భానికి అన్వయం చేసుకోండి" అంటూ సుజాత చివాలున లేచివెళ్ళి రమేశ్ ప్రక్కన కూర్చున్నది.

సుందరికి ఆ సన్నివేశం అంతా ఒక్కసారి స్మృతిపథంలో మెదిలింది.

×× ×× ××

"నేనేం చెప్ప" అని మాత్రమే అన్నది సుందరి.

"ఇంక ఇంతటితో పోనీయ్, సుందరీ! నా మాట విను" అన్నది యశోదమ్మగారు.

"గట్లనే వింటను. కాని, ఉట్టినే నా నోరు నొక్కకుండ్రి. న్యాయం చెప్పుండ్రి. మీ చేత కాకుంటె నలుగుర్ని పిల్చి పంచాయతి పెట్టుండ్రి. నే నేమైనా తప్పు మాట అన్ననని అందరంటె అప్పు డనుండ్రి. కొట్టుండ్రి. ఊకొంటా" అన్నది సుందరి గుక్క తిప్పుకోకుండా. అలా అంటూనే ఆమె కంచంలో చెయ్యి కడుక్కొని లేచి నిలబడింది.

"చూచావా...చూచావా! వదినా, ఎంత అఘాయిత్యంగా మాట్లాడుతున్నదో! అనవల సినన మాటలన్నీ అని పంచాయతీ పెడుతుందట. అంటే ఏమిటో తెలుసా? హియరింగ్ అన్నమట" అన్నాడు రమేశ్.

"ఇంక నువ్వయినా ఊరుకో. ఆ మాట నీకు ముందే చెప్పాను. మరి మాట్లాడకు. గతం త్రవ్వకొని ప్రయోజనం లేదు. రాత్రి సినిమలో చాలా గొడవ జరిగిందని పిల్లలు వివరంగా చెప్పారు. వాళ్ళు నిజంగా భయపడిపొయ్యారు. సుందరి ఉన్నది కనుక వాళ్ళ పరువూ, నా పరువూ దక్కింది. రాత్రి ఇంటికి తిరిగి వచ్చాక నువ్వు చేసిన అల్లరి ఆగం వీళ్ళెవరూ చూడలేదు కనుక నీ పరువు దక్కింది. అయినా, ఆడపిల్లలు నీవెంట ఉండగా నువ్వు అతనితో హాల్లో అలా కాలక్షేపం చెయ్యడమేమిటి-అదీ తాగినవాడితో? పైగా వాళ్ళ ఇంటికి వెళ్ళి తాగి, ఇంటికి వచ్చి అంత ఆగం చెయ్యడం ఏమిటి?" అంటూ యశోదమ్మగారు ఏకరువు పెడుతుంటే అడ్డుకొని, రమేశ్ పెద్దగా—

"వదినా!" అంటూ అరిచాడు.

"ఏం—ఎందుకంత పెద్దగా అరుస్తున్నావు? కన్నతల్లిలా పెంచాను. పెద్దవాణ్ణి చేశాను. నువ్వు చేసిన నిర్వాకం ఇదన్నమాట. నన్నే బెదిరిస్తున్నా వన్నమాట. అవునా! ఎందుకూ ఊరుకొంటున్నాననేగా?" అన్నది యశోదమ్మగారు.

"కన్నకొడుకయితే గిట్లనే ఊకొంటారు?!" అన్నది సుందరి.

యశోదమ్మగారు సుందరివంక అలా చూచింది. కోపం, దైన్యం, నిస్సహాయత స్పష్టంగా కన్పించాయి ఆ చూపులో. సుందరి మారు మాట్లాడకుండా వెనుతిరిగి గబగబా మేడ మీదకు వెళ్ళింది.

×× ×× ××

ఆ మరునాడే మీనాక్షి, కాత్యాయనీ మద్రాసుకు ప్రయాణమయ్యారు. మొదట యశోదమ్మగారు తనూ కూతుళ్ళవెంట వెళతానన్నది. ఆమె అత్తగారు వద్దంటే ఎందుకో

న్నది. పిల్లలు తీరా ప్రయాణమయ్యాక రామారావుగారు—"అది వెళ్లడంలేదు కనుక పోనీ నేను వెళ్ళి వస్తాను" అన్నారు. పరమేశ్వరరావుగారు వారి స్తే ఆయన కూడా మానుకొన్నారు.

ఆతర్వాత మూడు రోజులదాకా రామారావుగారు రమేశ్‌వంక చూడలేదు. ఇంట్లో ఎవరితో మాట్లాడలేదు. ఆ మూడు రోజులూ రమేశ్ ఇంట్లో మాత్రం ఏ గొడవా చెయ్యలేదు. బయటకు వెళ్ళినప్పుడు సాయంత్రంపూట స్వల్పంగా తాగివస్తున్నాడని తెలిసినా. యశోదమ్మగారు రమేశ్‌ను ఆ విషయం హెచ్చరించలేదు.

సుందరి ఆ మూడు రోజులూ మేడ దిగి రాలేదు. పరమేశ్వరరావుగారికీ, రంగమ్మగారికీ పరిచర్యలు చేసింది. చివరకు ఆయనే అడిగారు—"ఏమమ్మా, సుందరీ! మా వాడిమీద అలిగావా?" అని.

"అవు నలిగిన. కాని, ఎవరికి లెక్క!" అన్నది సుందరి బుంగమూతి పెడుతూ.

"అలా అనకు! ఇంట్లో అందరికీ నువ్వు అంటే ఇష్టం. ఎవరైనా నిన్ను ఒక్కమాట అన్నారా చెప్పు?"

"లేదు... అన్న."

"మరెందు కింత కోపం? వాడూ చిన్నవాడు..." అని ఏదో చెప్పబోతుంటే ఆయన మాటకు అడ్డువచ్చి రంగమ్మగారు—

"ఇంకా నయం. మనమడి ననలా" అన్నది నవ్వుతూ.

"ఇంతటితో నువ్వూరుకుంటావా, లేదా" అంటూ ఆయన ఆవిడ వంక కోపంగా చూచారు. రంగమ్మగారు అప్పటికి ఊరుకొన్నట్లే కన్పించింది. ఆయన సుందరి వంకకు తిరిగి నెమ్మదిగా—"అమ్మాయ్! నా మాట విను. రమేశ్‌తో తగూ పెంచుకోవద్దు. చిన్న పిల్లవు కనుక నీకు చెబుతున్నా" అన్నారు.

"మీ మనుమరాళ్ళకంటె చిన్నది. ఆ పిల్లకేం చెబుతారు. చెప్పదలి స్తే యశోదమ్మకూ, రామారావుకూ చెప్పండి. రమేశ్‌కు చెప్పండి. అయినా, మన ఇంటా వంటా లేని అలవాట్లు వీడికి ఎలా వచ్చాయో? ఈ తాగటం ఏమిటీ! ఈ అల్లరి ఏమిటి అలగా జాతి వాళ్లలా!" అన్నది రంగమ్మగారు మాటలు సాగదీస్తూ.

"అబ్బబ్బ... నువ్వూరుకోవే ! అసలే నేను కుళ్ళి కుళ్ళి చస్తుంటే నువ్వింకా పొడుస్తావెందుకే ?"

"మధ్యలో మీరు కుళ్ళడం దేనికీ అంట !"

"ఖర్మ...నా ఖర్మ" అని ఆయన అరచేతితో నుదుటి పైన గట్టిగా కొట్టు కొన్నారు. వచ్చని పసి నిమ్మ పండు పై భాగాన నల్లని మరకలు పడినట్లు అయింది. ఆ మాత్రానికే నుదుటిపై చర్మం కమిలినట్లు అయింది.

సుందరికి జాలి వేసింది. "అయ్యయ్యో నా మూలకంగా మీరింత పరేషాన్ అయినరు. ఊకోండి. పార్వతీ పరమేశ్వరులులా ఉన్నరు. మీకు జరంత కష్టం కలిగించ కూడదు..." అంటూ సుందరి ఇంకా ఏమో చెప్పబోతూంటే, పరమేశ్వరరావుగారు అడ్డువచ్చి, "దాని మాటలుపట్టించుకోకు. అది ఉండుండి అలా అఘాయిత్యంగా మాట్లాడుతూ ఉంటుంది" అని ఆగి, కొన్ని క్షణాల తరవాత, "రోజులు మారి పోయాయి. ఇప్పటి యువకులు చాలా మంది ఇలా తయారవుతున్నారు. సిగరెట్లు, బీడీలు తాగడం లాగానే మద్యపానం కూడా ఇప్పుడొక ఫాషన్ అయిపోయింది. ఈ దురభ్యాసాలు మాన్పించడం ఎవరివల్లా కాదని అనిపిస్తున్నది" అన్నారు.

అందుకు సుందరి మాట కలుపుతూ—"అట్లనకుండ్రి. జర కోషిష్ చెయ్యాలి. మాబావ ఎంత మందినో తాగకుండ మాన్పించిండ్రు. ఒక లంబాడీ గూడెంలో అయితే మొత్తం అందరిచేత మాన్పించిండ్రు" అన్నది.

"అయితే, అక్కడ కూడా తాగుతా రన్నమాట !" అన్నది రంగమ్మగారు ఆశ్చర్యం ప్రకటిస్తూ.



"అవునండి. తాగుతరు. కాని, ఇక్కడి నంగతులు గిట్లున్నవని తెలవదు. ఈ ప్రాంతానికి స్వాతంత్ర్యం ముందు వచ్చింది. ఇటు కాల్వ లొచ్చినయ్, అటు కాలేజీ లొచ్చినయ్. ఆర్థికంగా, రాజకీయంగ వృద్ధిలోకి వచ్చినరు. అంగ్రీజు చదివి బాగు పడ్డరు. నాగరికత, నంస్కారం నేర్చు కొన్నరు...అని మానాయన లాంటివాళ్ళు అనుకొంటన్నరు. కాని, అది నిజం కాదు. పల్లెల్లో కల్లు సారాయి తాగుతరు; పట్నంలో బ్రాంది వి స్కి పట్టిస్తరు" అన్నది సుందరి.

"అవునమ్మా... అవును! ఈ తాగుడు అంతటా వ్యాపించింది జాడ్యంలా" అన్నా రాయన.

"అయితే, ప్రభుత్వమే ఎందుకు నిషేధించ కూడదూ?" అని అడిగింది రంగమ్మ గారు.

"కష్టం. అదీ కాక ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం పోతుంది. నిషేధం పెడితే దొంగ సారా బట్టీలు పెరిగి పోతాయట. కాపు సారా మరింత ప్రమాదమట" అన్నారు పరమేశ్వరరావుగారు.

సుందరి కల్పించుకొని, "అసలు కారణం నేను చెబ్త. మంది చేత మందు మాన్పిస్తె తిరగబడతరు-నర్కారోళ్ళ మీద, జాగీర్‌దార్ల మీద, దొర్ల మీద. ఎందుకంటె తెలివొస్తుంది కన్క" అన్నది.

"బాగుంది - బాగా చెప్పావు" అన్నా రాయన.


"మరో కారణం చెబ్త. ఎన్నిక లొచ్చినాయంటె కల్లు సారా కాల్వలై పారతయి. ఆ నాల్గు రోజులు పైన లివ్వక్కర్లేదు. చివరకు ఓట్లు ఇస్తె చాలునంటరు. జనం అట్లనే చేస్తరు. మావూర్లల్ల జనం కూటికి లేక, గుడ్డకు లేక చస్తన్నరు. కాని, తాగుతున్నరు. కష్టం చేసి నంపాదించి పైనలిచ్చి తాగుతరు. బానన్లు అమ్మి తాగుతరు. ఉద్దరమీద తాగుతరు. జబ్బు లొస్తున్నయి. కాని, మానడం లేదు.." అని సుందరి క్షణం ఆగితే, ఆయన అందుకొని-

"అక్కడే కాదు, ఇక్కడ కూడా అంతే. దీనికేం గాని, మరో కారణం చెబుతా నన్నావు ఏమిటది?" అని అడిగారు.

"ప్రభుత్వం నిషేధం పెట్టదు. ఎందుకంటె వీళ్ళు ఎలక్షన్ల సారాయి కంట్రాక్టర్ల విరాళాల మీద, గుడుంబా వ్యాపారుల లంచాల మీద ఆధార పడుతున్నరు. వాళ్ళ పైనల్తో ఎన్నికల్లో గెల్చినంక ఇంక వాళ్ళపక్షమే ఉంటరు. ఇంక నిషేధం ఎట్లొస్తది?!" అన్నది సుందరి.

"చాలా చక్కగా వివరించా వమ్మా" అన్నారు ఆయన.

కాని, రంగమ్మ గారు వినుక్కుంటూ, "నాకేం అర్థం కావడం లేదు. అయినా, ఈ సారా వురాణం నా కెందుకు" అని నెమ్మదిగా లేచి




వంట ఇంట్లోకి వెళ్ళింది.

ఆవిడ అటు వెళ్ళాక ఆయన, "అమ్మాయి సుందరీ! నీ కీ విషయాలన్నీ ఎలా తెలిశాయమ్మా?" అని అడిగారు.

"మా బావ చెప్పిండ్రు."

"అలాగే మరి ఇంత తెలిసిన దానివి...రమేశ్ తాగుతున్నాడని ఇంత కోపం తెచ్చుకొన్నావు దేనికీ? నువ్వే నెమ్మదిగా, ఉపాయంగా అంచక్కా మాన్పించాలి."

"అందు క్కాదు నా క్కోపం వచ్చింది. ఆయనగారు ఆ సుజాతతో గట్ల చనువుగుండడం మంచి గనిపించలా. ఆ మాట అన్నను; నా ఇష్టం పొమ్మన్న రాయన. అందు కలిగిన."

"అల్లాగా...ఇప్పుడర్థం అయింది. కాని, ఒక్క మాట. వాడు తాగుతాడని తెలిసింది. అదీ ఇటీవలనే అలవాటు అయింది. కాని, ఇతర వ్యసనాలు లేవు. నా మాట నమ్ము. ఆ సుజాత అయినా చెడ్డ పిల్ల కాదు. ఊరికే అలా అందరితో పూసుకొని తిరుగుతుంది. దురుసుగా మాట్లాడుతుంది. తుంటరిలా కన్పిస్తుంది. అంతే! అంతమట్టుకే. నువ్వు అనవసరపు అనుమానాలు పెట్టుకోకు. ఇంతకు పూర్వం ఇలాంటి అనుమానం కలిగితే యశోదమ్మ అన్నీ విచారించింది. అనుమాన నివృత్తి అయింది. నా మాట నమ్ము. నరేనా?" అన్నా రాయన.

"గట్లనే నమ్ముతా!"

"అది నరేగానీ, సుందరీ, నేను మరో మాట అడుగుతా. ఏమనుకోవు గదా?"

"అడుగుండ్రి."

"మీ బావకు గానీ, నీకు గానీ... పార్టీతో సంబంధం ఉన్నదా?"

"ఏ మట్లడిగినరు? నరే చెబ్త. మా బావకు ఉండె. నాకు లేదు. నమ్మరా, లేదా? నమ్ముండ్రి."

"నమ్ముతాను. ఏదెలా ఉన్నా, మీబావ గట్టివాడని అనిపిస్తున్నది. నీ పెళ్ళికి వచ్చినట్లు లేదే... వచ్చాడా?"

"రాలేదు" అని మాత్రమే అని, కళ్ళు తుడుచుకొంటూ సుందరి, "ఇంక ఆ ముచ్చట మానుండ్రి" అన్నది నెమ్మదిగా.

"అలాగే. అలాగే" అన్నా రాయన మరో వైపు చూస్తూ.

కొన్ని క్షణాల తర్వాత సుందరి పెద్దగా, "పెద్దలు మీ రడిగినరు; నేను చెప్పిన. అట్లనే నే నొకటి అడుగుత... మీరు చెబ్తరా?" అన్నది.

"ఊ... అడుగు" అన్నా రాయన, ఆమె వంక చూడకుండానే.

"ఆయన మీకు మనుమడు గదూ?"

"ఆసి భడవ! ఏ మడిగావు! సుజాత కంటె రెండాకులు ఎక్కువ చదివినట్లున్నావే! అసలు నీ కా అనుమానం ఎందుకు, ఎలా కలిగిందో చెప్పు!"

"ఇంతకు మున్పు అన్మానం కల్గింది. యశోదమ్మ గారిని అడిగిన. ఆమె ఏమన్ల. ఇందాక రంగమ్మ గారు ఓ మాట అన్నరు- ఇంకా నయం... మనుమ డన్ల-అని. అందుకు మీరు జర కన్నెఱ్ఱ చేసినరు. దాంతో అన్మానం తీరింది."

"ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టే తెలివితేటలు ప్రసాదించాడు దేవుడు నీకు. ఆ తెలివి నద్వినియోగం చేసుకో. అనవసరపు విషయాలు ప్రస్తావించ కూడదు. సుజాతలాగా అతి తెలివి ప్రదర్శించాలని ప్రయత్నించకు" అంటూ ఆయన ఇంకా ఏమో చెప్పబోతూంటే, సుందరి అడ్డు వచ్చి-

"పొరపాటైనది. ఇంక ఆ ముచ్చట మానుండ్రి. మన్నించండి. చిన్న దాన్ని కన్క- ఒక్క కోరిక కోరత. రమేశ్‌గారిని తీస్క పోతా-


సూర్యాపేటకు. అక్కడ మా వాళ్ళున్నరు. మంచిగ ఎట్లుండలో చెప్పిస్తను. అందరి కుపకారం చేసే మంచి మనిషిగ మార్పిస్తను. ముందు ముందు మార్పిస్త. ఇక్కడి ఈ దోస్తులకు దూరం గుంటె ఆయన మార్తరు. మీరు ఊ అనుండ్రి చాలు" అంటూ ప్రాధేయపడ్డది.

ఆయన నవ్వుతూ, "ఊ ...సరే. లక్షణంగా తీసుకొనివెళ్ళు. సదాశివానుగ్రహ ప్రాప్తిరస్తు. శీఘ్ర మేవ సుపుత్ర ప్రాప్తిరస్తు" అంటూ దీవించారు.

సుందరి ఆయనకు వినయంగా నమస్కరించింది. అంతలో సిగ్గు పడి పోయింది. తల వంచుకొన్నది. ముసి ముసి నవ్వులు నవ్వింది. ఆమె నెమ్మదిగా వెను తిరిగి మెట్ల వైపుకు వెళ్ళింది.

×× ×× ××

## 4




"ఏమిటి... నాకు ముందుగా చెప్పకుండా ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేశావు! ఏమిటి నీ ఉద్దేశం?" ఒక వంక నవ్వుతూనే, మరొక వంక డబాయిస్తున్నట్లు అడిగాడు రమేశ్.

సుందరి మాట్లాడలేదు.

రమేశ్ మళ్ళీ అడిగాడు.

"మీ పెద్ద వాళ్ళంద రొప్పుకొన్నరు. మీ వదినగా రన్నరు మీ కిష్టమేనని. మీ మాట చెప్పుండ్రి. మోటరు నడపడానికి డ్రైవరు కూడ వస్తున్నడాయె! ఇంక మీ కేమిటి కష్టం. ఆరు నెలలైంది అక్కడి మావాళ్ళను చూచి. చూడాలనిపిస్తున్నది. పోదాం పదుండ్రి. జర నాకు సోపతి కావాలి. నాకు జర తోడుగ ఉండుండ్రి గంతె."

"నాకూ ఇష్టమే! ఆ ఊరూ ఈ ఊరూ మన కారులో వెళ్ళడం సరదాగా ఉంటుంది. ఇక్కడ నాకు ఏమీ తోచడం లేదు. సరె పోదాం. కాని, కాస్త డబ్బు తీసుకొందాము."

"నా దగ్గర మస్తుగున్నాయి పైసలు."

"చిల్లర పైసలా?"

"కాదు. ఏక్ హజార్."

"అంటే వెయ్యి కదూ!"

"అవ్. మీ కెరికేనే?"

"సర్లె కాని, నీ దగ్గర ఉన్నట్లు ఎవరికీ చెప్పకు. ఒకరికి తెలియకుండా మరొకరి దగ్గర...ముందు మా నాన్న దగ్గర, తర్వాత మ వదిన దగ్గర లాస్టుకు మాఅన్నయ్య దగ్గర డబ్బు కొట్టేస్తా."

"వొద్దు. అట్లడిగితె అన్మానా లొస్తయి. ఈ పైకం మీ కాడుండ నివ్వుండ్రి. సూర్యపేటల మా అత్తమ్మున్నది. ఆమెను అడిగితె చాలు—రెండు వేలు, మూడు వేలు, ఎంతడిగితె గంతిస్తుంది. ఆమె కాడ పైసలు మస్తుగున్నయి. అడిగేటంటోళ్ళు లే రంటది."

"ఓకె. వస్తాను. అయితే, ఒకే ఒక షరతు. ఏమి టంటే నా స్వేచ్ఛకు నువ్వు అడ్డు రాకూడదు."

"గట్లనే రాను. మా బావ చెప్పిన పన్లున్నయి. అవి చూడాలి. మీ రడ్డు రాకుండ్రి."

"ఓ అల్లాగే. ఊ అంటే, ఆ అంటే మీ బావ ప్రసక్తి తెస్తూ వచ్చావు. తెగ మెచ్చుకొన్నావు. మరి ఇంతకూ ఆయన్ను చూపిస్తావా?"

"చూయిస్త."

"మరో మాట. నా సొంత విషయాలు అక్కడ ఎవ్వరితోనూ ఒక్క మాటకూడా ఎత్తకూడదు. అంటే తెలిసిందా?"

"గట్లనే. మీ రహస్యాలు మీరు కాపాడుకోండ్రి. మీ పరువే నా పరువు. గంతె."

"నాకు కొంచెం మారాలని ఉంది."

"కోరిక ఉంటె మార్పు వస్తది. వాతావరణం మారితె, పరిస్థితులు మారితె మార్పు వస్తది."

"మంచిదే. నా కొత్త సూట్లు మేడమీద ఉన్నాయి. అవికూడా తెచ్చి పెట్టిలో సర్దు. మరో మాట. మనం తీరా బయలుదేరే సమయానికి మాఅన్నయ్యకూడా వదినను తీసుకొని వస్తా నంటాడేమో! నన్ను ఒంటరిగా ఎక్కడకూ వెళ్ళనీయడు."

"ఒంటరిగ కాదుగ. తోడు నే నున్న గద."

"అయినా, వెళ్ళనీయడు. తాగి ఎక్కడో పడిపోతానని భయం. కారుంది గదా అని వెంట వస్తానంటాడు."

"ఆ ఫికర్ అక్కర్ల. వా ళ్ళిద్దరు రైల్ గాడిలో మద్రాసు వెళ్తరట. అయిదార్నెల్లు గాడ్నె ఉంటరట! ఆయన మంచివారు సుమండి."

"ఏం మంచిలే. ఆస్తి పంచమంటే అడ్డు వస్తున్నాడు. నాలుగు వాటాలు వేసి, ఒక్క వాటా నా కిమ్మన్నాను. అయినా, ఒప్పుకోవడంలా."

"గట్లనకుండ్రి. ఆయనమీద షికాయత్ చేయకుండ్రి. భాగాలు పంచితె తన పాలుకూడా మీ కిస్త నన్నరు."

"అల్లాగా...ఆశ్చర్యంగా ఉందే! ఈ ఇల్లూ వాకిలీ ఆయనగారి సంపాదన మీదనే కట్టారని ఊళ్ళో అంతా చెప్పుకొంటున్నారు. పూర్వం మాకు కొంత భూమి పుట్రా ఉండేదట. మా నాన్నగారే అమ్మారట—బహుశా ఈయనగారి చదువులకోసమే అయి ఉండచ్చు. నీ కో గమ్మత్తు మాట చెప్పనా?"

"చెప్పుండ్రి."

"మాఅన్నయ్య విశాఖపట్టణంలో చదువుకొనే టప్పుడు కొంచెం సరసుడట—అంటే షోకిల్లా అన్న మాట."

"ఇ దెవ్వరు చెప్పిన్రు?"

"నా స్నేహితురాలు సుజాత చెప్పింది. వాళ్ళ బంధువు వృద్ధురాలు ఒకావిడ విశాఖపట్టణంలో పెద్ద లేడీ డాక్టరట. ఆవిడ చెప్పిందట!"


"ఆవిడగారు అట్లెందు కంటది. సుజాత మాటలు నమ్మకుండ్రి. ఆమె నోరు మంచిది కాదు. ఆమె నాతొ ఏమన్నదొ చెప్ప మంటారా? మీరు మీ వదినగారు ముం దడిగితె నే జెప్పనైతి. మీ రందరు మంచి మంచి మొగాళ్ళు గీ డుండగా, మీ బావ ఎందుకు యాద కొచ్చిం డని అడిగినది. దాని కే మర్థం చెప్పుండ్రి. మీ దోస్తు కనుక ఊకొన్న."

"సుజాత అలా అన్నదా! అన్నా అంత దురర్థం ఊహించి ఉండదు. ఆమె అందర్నీ గురించీ అలాగే కొంచెం లూసుగా మాట్లాడుతూ ఉంటుంది. ఏవో కూపీలు తీస్తుంది. బ్లాక్ మెయిల్ చెయ్యాలని ప్రయత్నాలు చేస్తుంది. ఆమెకు అదంతా ఒక సరదా."

"ఆమె తెగించిందన్నమాట! అటువంటి ఆమెతో, తాగుబోతు ఆమె అన్నగారితొ గంత దోస్తిగ ఎందు కుంటరు?"

"మంచి స్నేహితులు కనుక."

"మంచి స్నేహితులైతె గిట్లంటరా! రహస్యాలు బయట పెడత నని బెదిరించి పైస




గుంజుతరా? ఆమె మాటకే మర్థం—అన్నగారు షోకిల్లగ తిరిగినరు కనుక మీరుగూడ తిరుగుండ్రని చెప్పటమే కద!"

"అయితే, నీకు ఇంగ్లీషు వచ్చు నన్నమాట! అమ్మ దొంగా! అయితే, జాగ్రత్తగా ఉండాలి."

"ఆ మాట మీ దోస్తులతొ చెప్పుండ్రి."

"అది సరేగాని, సుందరీ! ఆడవాళ్ళు అత్తవారింటినుంచి పుట్టింటికి వెళ్ళాలని ఉబలట పడతారు గాని, మేనత్త ఇంటికి వెళ్ళాలనుకొంటారా?" అని అడిగాడు రమేశ్, మాట మార్చాలని ప్రయత్నిస్తూ.

సుందరి నవ్వి ఊరుకొన్నది.

"చెప్పపోయినా తెలుస్తున్నదిలే. మీ మేనత్తకూ, మీ మేనబావకూ నన్ను చూపించాలనీ, నా సూటూ బూటూ, కారూ గీరూ చూచి వాళ్ళు ఆశ్చర్యపడతారనీ అనుకొంటున్నావు గదూ?"

"గట్లనే అనుకోండ్రి."

"అక్కడ మీ వాళ్ళల్లో ఎవరైనా నాలాగా చదువుకొన్నవాళ్ళు ఉన్నారా?"

"ఎవరి సంగతో ఎందుకు. మా బావ విశాఖపట్నంలో డాక్టరీ చదివిండు. శ్రీకాకుళం అంత తిరిగిండు. వరంగల్ల, సూర్యపేటలొ మంచి లెక్చ ర్లిచ్చిండు. పాటలు పాడిండు. నాకు నేర్పించిండు."

"ఈ విషయాలు చాలాసార్లు చెప్పావు. అది కాదు. మనిషి ఎలా ఉంటాడు. నాలాగా అందగాడా?"

"ఓహొ మీ రొక్కరె గొప్ప అందగాణ్ణనుకొంటున్నారు? అందచందాల్లొ మీ కంటె మీ అన్నగారు గొప్ప. ఆయన కంటె మా బావ వెయ్యి రెట్లు గొప్ప. కాని, ఎండల్లొ వానల్లొ తిరిగి తిరిగి, పల్లెల్లొ గూడాల్లొ ఉండి ఉండి, సరిగ తినక, సరిగ పండక మనిషి నల్లగైపోయినడు. చాల బక్కగైపోయినడు. మా అత్తమ్మ, మామయ్య బావ నట్ల చూచి గొల్లున ఏడ్చినరంటె నమ్ముండ్రి" అంటూనే, సుందరి చప్పున మాట్లాడడం మానివేసి ఒక చేత్తో పమిటకొంగు నోట కుక్కుకొన్నది. రెండో చేత్తో రెండు కళ్ళూ ఒత్తుకొన్నది. కొన్ని క్షణాల తర్వాత హఠాత్తుగా మరో వైపు తిరిగింది.

'ఇదేమిటి తన బావ విషయం చెప్పినంత సేపు చెప్పి, హఠాత్తుగా ఇలా మారిపోయింది. ఎందుకు—ఎందుకని?' అని రమేశ్ తన్ను తాను పలుమార్లు ప్రశ్నించుకొన్నాడు. ఆమెను అడగాలనుకొన్నాడు. బుజాలమీద చేతులు వేసి చాలా నెమ్మదిగా—"ఇంతకూ మీ బావ..." అని అతను ఏదో అడగబోతుంటే, సుందరి చప్పున అతని చేతులు తన బుజాలమీద నుంచి తీసేసి—

"ఇంక ఆ ముచ్చట మానుండ్రి" అని క్షణమాగి, వెనుతిరిగి భారంగా అడుగులో అడుగు వేసుకుంటూ ప్రక్క గదిలోకి వెళ్ళింది.

## 5

"ఏమండీ చిన్నమ్మగారూ! ఇటు ఇంకా ఎంత దూరం వెళ్ళాలి? సూర్యాపేట ఊళ్ళోకి పోనివ్వకుండా ఇటు బైపాస్ రోడ్డు మీదకు మళ్ళించారు. ఊరంతా అటుంది. ఇది ఖమ్మం వెళ్ళే రోడ్డు. మీరు అనుకొన్న చోటుకు దారి తెలియకపోతే ముందే చెప్పండి. ఊళ్ళోకి వెళ్ళి కనుక్కొందాం. ఇంటి దగ్గర పెద్దయ్యగారూ, యశోదమ్మగారూ జాగ్రత్త అంటూ వెయ్యిసార్లు చెప్పి పంపారు. మీ రేమో ఇలా జాగు చేస్తున్నారు" అన్నాడు డ్రైవరు.

సుందరి అతని మాటలు పట్టించుకోలేదు. అటే పోనిమ్మని సంజ్ఞలు మాత్రమే చేసింది.

సూర్యాపేట రాకముందు సుందరి చాలాసార్లు కారు ఆపించింది. చప్పున దిగి, "ఇటు పోతే ఇమామ్‌పేట. అటు పోతే సూర్యాపేట...మాబావ పెరిగిన ఊరు. నే నెరిగిన ఊరు. అరుణోదయమైన ఊరు—అస్తమయం ఎరుగనూరు..." అంటూ దీర్ఘాలు తీస్తూ, సంతోషంతో పొంగిపోతూ గంతులు వేసింది.

రమేశ్‌కు ఆమె ప్రవర్తన చాలా విచిత్రంగా కన్పించింది. కొంచెం ఎబ్బెట్టుగా కూడా అనిపించింది. అతను కొన్నిసార్లు విసుక్కొన్నాడు; కసురుకొన్నాడు. కాని, సుందరి అవేమీ అంతగా పట్టించుకోలేదు. చివరకు ఒకసారి తనూ కారు దిగి ఆమె ముందుకు వెళ్ళి—"ఏమిటి మరీ విచిత్రం! ఎంత బంధువైతే మాత్రం ఇంత మరీ వేలంవెర్రి పనికిరాదు. పద పద" అంటూ చెయ్యి పుచ్చుకొని లాగాడు.

"గట్లంటారు! మా బావ మామూలు బంధువు కాదు. నాకు ఒక్కర్తెకె బంధువనుకొన్నరా? ఆ పల్లెకు పొండి. ఈ గూడెంకు వెళ్ళుండ్రి—అడుగుండ్రి చెబుతరు. మంది చేత మందు మాన్పించిండు. మందిని కూడగట్టిండు. అంద రైకమత్యంగ, మంచిగ ఎట్లుండలొ చెప్పిండు. సొంతపు సొమ్ము ఖర్చు చేసి దవాఖానాలు పెట్టిండు. మంచి మందులిచ్చి జబ్బులు నయం చేసిండు. అందరికి చదువు చెప్పిండు. వేష భాషలు మార్పించిండు. ఇప్పుడుపోయి అడుగుండ్రి చెబ్తరు. మా బావ మీకు బంధువని చెబితె చాలు...మీ కాల్మొక్తరు. మిమ్మల్ని నెత్తిన పెట్టుకొంటరు. బావ పుట్టిన రోజు ఈ దినం—అందుకొన్తున్న" అన్నది సుందరి.

"సరె సరె పద. ఇవ్వాళ నీ కేదో పిచ్చి పట్టినట్లున్నది" అంటూ బలవంతాన లాక్కొనివచ్చి కారులో కూర్చుండ బెట్టాడు రమేశ్.

సుందరి దారి చెప్పింది. కారు నెమ్మదిగా పోనిమ్మన్నది. పది నిముషాల తర్వాత—"ఆ గీడ్నే—గీడ్నే—కా రాపు" అన్నది ఆమె పెద్దగా.

కారు ఆగీ ఆగగానే ఆమె బయటకు ఒక్క దూకు దూకింది; మెట్ట పొలాలలోకి పరుగు పెట్టింది.

రమేశ్ నెమ్మదిగా కారు దిగి రోడ్డు ప్రక్కగా నిలబడ్డాడు. అప్పటికే సాయంత్రం అయింది. సూర్యుడు బాగా ఎఱ్ఱబడిపోయాడు. బాగా గాలి వీస్తున్నది. మెరక భూముల పైనుంచి ఎఱ్ఱని దుమ్ము ఉవ్వెత్తుగా లేచి లోతట్టు ప్రాంతాలవైపుకు కొట్టుకొనిపోతున్నది.

అతను ఆమె పరుగు పెడుతున్నవైపు తిరిగి చూచాడు. మొదట ఎవరూ కన్పించలేదు. కొంచెం జాగ్రత్తగా, పరిశీలనగా చూచేసరికి ఎవరో చిన్న వేదికపై నిలబడి ఉన్నట్లు లీలగా అనిపించింది. కొన్ని నిముషాల తర్వాత సుందరి అక్కడకు చేరుకొని ఆగినట్లు స్పష్టం అయింది.

అతను సూటు నలిగిపోతుందనీ, నల్లని బూట్లనిండా మట్టి—అందులోనూ ఎఱ్ఱ మట్టి పడుతుందనీ భయపడుతూనే, విసుక్కొంటూనే గబగబా ముందుకు నడిచాడు. ఆమె

దగ్గరకు వెళ్ళాడు.

సుందరి ఏదో పెద్దగా మట్లాడుతున్నది. "బావా! నే నొచ్చిన. నువ్వు వొద్దంటె కూడా వొచ్చిన. అప్పుడుకూడ వొచ్చిన. ఏడవొద్దన్నవు కదూ...కాని, ఏడుపొస్తున్నది. అప్పుడు చిన్నగున్నా. భయపడిన ఊకొన్న...కాని, బావా" అంటూ సుందరి దుఃఖం ఆపుకోలేక పెద్దగా బొబ్బలు పెట్టింది.

"ఇతనేనా మీ బావ" అని అడిగాడు రమేశ్, ఎదురుగా దిమ్మమీద ఉన్న బొమ్మను చూపిస్తూ.

ఆమె తల ఊపింది.

అంతలో రోడ్డుమీద మరో కారు వచ్చి ఆగినట్లనిపించింది. కొన్ని నిముషాల తర్వాత ఇద్దరు వృద్ధ దంపతులు దగ్గరకు వస్తున్నట్లు మసక చీకటిలో అస్పష్టంగా కన్పించింది.

ఆ ముసలాయన దగ్గరకు రాగానే సుందరి ఆయన్ను అమాంతం వాటేసుకొని—"మాఉయ్యా! నే నొచ్చినా. అత్తమ్మా! నే నొచ్చినా. మీరు ఇక్కడకు రావొద్దన్నా నే నొచ్చినా..." అంటూ పెద్దగా ఏడ్చింది.

"ఊరుకో, బిడ్డా! ఊరుకో. వాడికోసం ఏడుస్తారా! చదువుకొన్నదానివి. వాడి దగ్గర, వాడన్నట్లు అసలైన చదువు చదివినదానివి. వాడు జనాన్ని చైతన్యవంతం చేసినాడు.




శానేమో అచేతనుడైనాడు. వాడు గురువు. నీవు శిష్యురాలవు. వాడి అనంతరం ఆ దారిలో ముందుకు వెళ్ళాలి. అంతేకాని, ఇలా ఏడుస్తారా. రా! ముందు ఇంటికి పోదాం" అంటూ బ్రతిమిలాడారు.

సుందరి ఆయన మాటలు విన్పించుకోక—"ఆనాడు నే చూసిన" అని ఏమో అనబోతుంటే, ఆ వృద్ధురాలు చప్పున సుందరి నోరు చేత్తో మూసింది.

"గింత కట్టెయిన చేతబట్టని బావ చేతికి నేల కూలినంక బందూ కెట్లొచ్చినదీ?" అన్న మాటలు అస్పష్టంగా విన్పించాయి.

ఆవిడ చేత్తో సుందరి నోరు గట్టిగా మూస్తూ పెద్దగా—"ఊరుకో మన్నానా" అంటూ గదమాయించింది.

సుందరి ఆమె చెయ్యి తీసేసి, "అత్తా! ఈ చెట్టు నడుగు, ఆ పుట్ట నడుగు. మాబా! గూడెంలో గొడ్డు నడుగు, బిడ్డ నడుగు, ఈ నేల నడుగు, ఆ ధూళి నడుగు. నిజం...అసలు నిజం నీకె తెలుస్తది" అని అంటూ ఆవేశంతో ఊగిపోతుంటే, ఆ ముసలాయన పెద్దగా అరుస్తున్నట్లు,

"అమ్మా! నువ్వు ఊరుకోవే, తల్లీ! ఎవరైనా వింటే నిన్నుకూడా అనుమానిస్తారు" అని కొన్ని క్షణాలు ఆగి రమేశ్‌వంకకు తిరిగి,

"బాబూ! ఈ వారసురాలే దిక్కు అనుకొన్నా! వారసుడవు నాకు దక్కావ్. పిల్లను ఓదార్చి తీసుకొనిరా! లాక్కొనిరా! నా కంత బలం లేదు" అంటూ భార్యను వెంటపెట్టుకొని నెమ్మదిగా రోడ్డువైపుకు నడిచాడు.

"రా, సుందరీ, ఇంక రా! నీ ఆత్మీయులను చూచాను. అసలు అన్నగారిని చూచాను. నాకు మార్గం కన్పించింది. పద...నువ్వు ముందు నడు. నాకు ఈ దారి కొత్త. కొంచెం ముందుకు వెళ్ళాక...నేను ముందు, నువ్వు వెనుక...సరేనా" అన్నాడు రమేశ్.

కళ్ళు తుడుచుకొని, సుందరి ఇటు తిరిగి కాలితో ఇంత మట్టి తన్ని ఎఱ్ఱి దుమ్ము లేపుతూ గబగబా ముందుకు నడిచింది. రమేశ్ చేతులు బారచాచి ఇలా అలా ఊపుతూ ఆమెను అనుసరించాడు.

దూరంగా బాట ప్రక్కన నిలబడ్డ పెద్దలకు పతాకం రెప రెపలాడుతూ ముందుకు వస్తున్నట్లు అనిపించింది. ✶


మొహమాటానికి సిగ్గుపడితే నివారణ ఆలస్యం అవుతుంది

వైవాహిక జీవితంలో నిజమైన ఆనందాన్ని అనుభవించండి.



సిగ్గు సందేహాలతో మీ దాంపత్య జీవితాన్ని వృధా చేసుకోకండి. మీ రోగము మరియు సమస్యల పూర్తి వివరాలను వ్రాసి ఉచిత సలహాను అడగండి. ఆయుర్వేద సూత్రాల పూర్తి సహకారాన్ని అందుకొని మీ దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేసుకోండి. మీ ఉత్తర ప్రత్యుత్తరాలు అత్యంత రహస్యంగా ఉంచబడకాయి. **యువతకు ఉచితంగా లభించే "స్త్రీ-పురుష్" గైడ్ కొరకు మాకు వ్రాయండి.**

**NATH AYURVEDASHRAM** (RW-10)
**P.O. KATRI SARAI (GAYA) INDIA**



తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి

తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు నుండి ప్రశంశలు అందినవి. అది అంత ప్రశంశలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారి పోవడం మొదలవుతుంది. మరియు శీఘ్రంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అది ఎంత బాగా పనిచేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెడు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారమునకై ఉచితంగా సలహాలు ఇయ్యబడుతున్నాయి. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒకసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి. మీ అసలురూపం మీకు వస్తుంది. **NATH AYURVEDASHRAM** (RW-25)
P.O. KATRI SARAI (GAYA)



సంకోచం లేకుండా సంప్రదించండి!
సరైన సంబంధాన్ని కుదుర్చుకోండి!!




ఫోన్:940

కాకతీయ
ఇన్‌ఫర్‌మేషన్ సర్వీస్
రాజేంద్రనగర్, 1వ లైన్, గుడివాడ-521 301